'జగనన్న సురక్ష'.. ఆరోగ్య రక్ష

- 90, 40 వార్డుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు
- వైద్య సేవలకు తరలివచ్చిన ప్రజానీకం
- చెంతకే స్పెషలిస్టు వైద్యులు


బుచ్చిరాజుపాలెంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శేషశైలజ


పేర్లు కంప్యూటరీకరణ చేస్తున్న సచివాలయ సిబ్బంది

విశాఖ విద్య: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. చెంతనే వైద్య సేవలు అందడంతో వివిధ రకాల అనారోగ్యంతో బాధ పడుతున్న వారు క్యూ కట్టారు. ఏకంగా 507 మంది వైద్య సేవలు పొందారు. జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ వద్ద బుధవారం సచివాలయం–4 పరిధిలోని గవరవీధి, రెడ్డి వీధి, గొల్లవీధి కాలనీ వాసులకు వైద్య సేవలు అందించారు. సచివాలయ ఆరోగ్య కార్యదర్శి, ఆశ కార్యకర్తలు కాలనీల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో వైద్య సేవలు పొందేందుకు ప్రజలు తరలివచ్చారు. యూపీహెచ్‌సీ వైద్యురాలు నమ్మి మానస ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి శిబిరానికి వచ్చిన రోగుల సంబంధించిన సమగ్ర వివరాల నమోదు చేశారు.

స్పెషలిస్టుల సేవలు

శిబిరంలో స్పెషలిస్టు వైద్యులు సేవలందించారు. సాధారణ వైద్య సేవలతో పాటు, చెవి, ముక్కు, గొంతు, స్త్రీల వ్యాధి నిపుణులు, కంటికి సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను అందజేశారు.

వైద్య సేవలపై ఆరా

శిబిరానికి వచ్చిన ప్రతీ ఒక్కరికీ వైద్య సేవలు అందించేలా వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. బుచ్చిరాజుపాలెం వద్ద బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని పశ్చిమ నియోజకవర్గ ప్రత్యేకాధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.శేష శైలజ పరిశీలించారు. ప్రతీ కౌంటర్ వద్దకు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జగదీశ్వరావు, జీవీఎంసీ 8వ జోన్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు శిబిరాన్ని సందర్శించారు. 90వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు నమ్మి శ్రీను, చుక్క ప్రసాద రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యం

సింథియా: పేదరికం కారణంగా ఏ ఒక్కరూ వైద్యానికి దూరం కాకూడదనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రవేశ పెట్టారని 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అన్నారు. ఏకేసీకాలనీ యూపీహెచ్‌సీ పరిధిలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వందలాది మంది వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో డాక్టర్ నాయుడు, ఏపీడీ చిరంజీవి, హనోక్, రాజాబాబు, సీవో శివ తదితరులు పాల్గొన్నారు.


బాలుడిని పరీక్షిస్తున్న ఈఎన్‌టీ నిపుణురాలు డాక్టర్ స్రవంతి


బీపీ చెక్ చేస్తున్న వైద్య సిబ్బంది


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న 40వ వార్డు కార్పొరేటర్ నాగేశ్వరరావు

ఉచితంగా మందులిచ్చారు



దివ్యాంగుడినైన నేను వైద్యం కోసం దూరాభారం వెళ్లాల్సిన పనిలేకుండా పోయింది. మా దగ్గరకే స్పెషలిస్టు వైద్యులు వచ్చి పరీక్షలు చేశారు. ఒళ్లు నొప్పులు తరచూ వస్తున్నాయి. దీని గురించి డాక్టర్‌కు చెబితే పరీక్ష చేసి నెలకు సరిపడా మందులు ఇచ్చారు. చాలా సంతోషంగా ఉంది.

– కేత శివ, గవరవీధి

రక్త పరీక్షలు చేశారు



ఒంట్లో నలతగా ఉంటుంది. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే పరీక్షలు, మందులకు వేలకు వేలు అవుతాయని వెళ్లలేదు. కానీ మా దగ్గరకే స్పెషలిస్టు వైద్యులు వచ్చారు. ఆరోగ్య సమస్య చెబితే రక్త పరీక్షలు చేశారు. డాక్టర్ ఇబ్బందులు అడిగి తెలుసుకొని మందులు ఇచ్చారు.

– వడ్లమూడి రుక్మిణి, గొల్లవీధి

సేవలు బాగున్నాయి



వైద్యశిబిరంలో డాక్టర్లు చేస్తున్న సేవలు బాగున్నాయి. శిబిరానికి వచ్చే వారికి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు కూడా బాగా చేశారు. మాలాంటి ముసలోళ్లకు ఇలాంటి వైద్య శిబిరాలను ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. డాక్టర్లు పరీక్షలు చేసి మందులు ఉచితంగా ఇచ్చారు.

– పెనుగొండ అనురాధ, జయప్రకాష్ నగర్

చెంతనే సేవలు



ఆరోగ్యం బాగాలేదని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్తే వేలకు వేలు వసూలు చేస్తున్నారు. అలాంటిది మా దగ్గరకే డాక్టర్లు వచ్చి ఉచితంగా సేవలు అందిస్తుండడం సంతోషంగా ఉంది. పరీక్షలు చేసి ఖరీదైన మందులు ఇచ్చారు. మా లాంటోళ్లకు వైద్య శిబిరం వల్ల ఎంతో ఉపయోగంగా ఉంది.

–గొల్లపల్లి వెంకటేశ్వరరావు, రెడ్డి వీధి

అనాథల సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

జీవీఎంసీ జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు


వివరాలు తెలుసుకుంటున్న జోన్-8 కమిషనర్ మల్లయ్యనాయుడు

విశాఖ విద్య: అనాథలు, ఏ దిక్కూ లేనివారి సంరక్షణ కోసం నగర పాలక సంస్థ ద్వారా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు జీవీఎంసీ–8వ జోన్ కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు చెప్పారు. 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న షెల్టర్‌ను బుధవారం పరిశీలించారు. కేంద్రంలో ఎంతమంది ఉన్నారు.. వసతి సౌకర్యాల గురించి మేనేజర్ ఎల్లేటి మమతను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా ఏర్పాట్లు చేయాలని సచివాలయ అడ్మిన్ ఈశ్వరరావుకు సూచించారు. మధ్యాహ్న భోజనం దాతల సాయంతో అందిస్తున్నట్లు షెల్టర్ మేనేజర్ మమత తెలిపారు. కేంద్రంలో ఉన్న వారంతా ఇదే చోట ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అనాథలుగా గుర్తించి, తగిన ధృవీకరణతో నూతనంగా ఓటు హక్కు కల్పించే చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందికి సూచించారు.

క్రీడలతో మానసిక ఆనందం

విశాఖ విద్య: క్రీడలు మానసిక ఆనందంతో పాటు, శారీరక ధృడత్వానికి దోహదపడతాయని రామకృష్ణ పాఠశాలల అధినేత ఎ. కృష్ణారెడ్డి అన్నారు. బుధవారం పాఠశాలలో క్రీడోత్సవాన్ని ప్రారంభించి అనంతరం మాట్లాడారు. విద్యార్థులు చదువులతో పాటు, క్రీడలపైఆసక్తి పెంచుకోవాలన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించిన క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీంద్రుడు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, హెచ్‌ఎం లక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

గౌరీపరమేశ్వరుల ఆలయంలో పూజలు


కోలాటం ఆడుతున్న మహిళలు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీలోని గౌరీపరమేశ్వరుల ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ నగర కార్యదర్శి, గౌరీ సేవా సంఘం ప్రతినిధి శరగడం పత్నిరావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గౌరీ నూకాంబిక అమృత వర్షిణి బృందం చేసిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

హడలెత్తిస్తున్న వీధి కుక్కలు


కాలికి గాయం

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు వినోద్ నగర్‌లో వీధి కుక్కల బెడద ఎక్కువైంది. దారుల్లో ప్రయాణించే వారిపై కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇంటింటికీ తిరిగి చీపుర్లు అమ్ముకునే వృద్ధురాలిపై బుధవారం కుక్క దాడి చేయడంతో కాలికి గాయమైంది. ఇప్పటి వరకు ఇలా పది మందికి పైగానే కుక్క కరిచిందని కాలనీ వాసులు తెలిపారు. అధికారులు స్పందించి కుక్కల బెడదకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

సావిత్రిబాయి సేవలు అజరామరం


సావిత్రిబాయికి నివాళులర్పిస్తున్న గొల్లమాల అప్పారావు, దళిత నాయకులు

కంచరపాలెం: మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి పూలే అని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు కొనియాడారు. దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు పిలుపు మేరకు బుధవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయంలో సంఘ సంస్కర్త సావిత్రిబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ కుల వివక్షను రూపుమాపడంలో జ్యోతీరావ్, సావిత్రిబాయి పూలే దంపతుల పోరాటం అజరామమన్నారు. కార్యక్రమంలో దళిత సేన నగర మహిళా కన్వీనర్ గొల్లమాల మీనా, కామేశ్వరరావు, ఝాన్సీరాణి, సీతారామ్, రాణి, జయకుమార్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠింపజేసి కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

స్ఫూర్తి ప్రదాత సావిత్రిబాయి పూలే


సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్


సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు

విశాఖ విద్య: మహిళా హక్కుల సాధన కోసం పోరాడిన యోధురాలు సావిత్రిబాయి పూలే అందరికీ స్ఫూర్తి కావాలని జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. 52వ వార్డు శాంతినగర్‌లోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో బుధవారం సంఘ సంస్కర్త సావిత్రిబాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి శ్రీధర్ పూలమాల వేసి నివాళి అర్పించారు. సావిత్రిబాయి పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఆర్పీలు, వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళా వికాసం

గోపాలపట్నం: విద్యతోనే మహిళా వికాసం సాధ్యమని నమ్మి విద్యాలయాల ఏర్పాటులో సావిత్రిబాయి పూలే ఎనలేని కృషి చేశారని ఎస్ఎస్టీఎల్ ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గౌరవ్ ప్రజాపతి కొనియాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో సావిత్రిబాయి చిత్రపటానికి ఆయనతోపాటు సంఘ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చైతన్య సామ్రాట్ పడాల, పూర్వ సంఘం అధ్యక్షుడు కొండేటి సత్యనారాయణ, సభ్యులు సిహెచ్.చంద్రలక్ష్మి, మువ్వల కనకరాజు, గోవింద రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా విద్యా ప్రదాత

నరవ విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి సీఎస్ఐఆర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.కె.ప్రసన్న, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పట్నాయక్ పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసన్న మాట్లాడుతూ 200 ఏళ్ల క్రితమే జ్యోతీరావ్ పూలేతో కలిసి సావిత్రిబాయి సామాజిక ఉద్యమాన్ని నడిపారన్నారు. సొంతంగా పాఠశాలలు నడిపి అణగారిన మహిళలకు విద్యను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల గ్రీవెన్స్ సెల్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.డయానా, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘన నివాళి

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురం హైస్కూల్ ఆవరణలో సామాజిక సేవా కార్యకర్త పెద్దిరెడ్ల నానాజీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి ఉపాధ్యాయుడు ప్రకాష్, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

- మల్కాపురంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో సీపీఎం నాయకుడు ఆర్.లక్ష్మణమూర్తి సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.


శ్రీహరిపురం హైస్కూల్‌లో పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నానాజీ తదితరులు


సావిత్రిబాయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శాస్త్రవేత్త ప్రసన్న, కళాశాల యాజమాన్యం

పింఛనోత్సాహం..!

- రూ.3 వేల పెన్షన్ పంపిణీ
- లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం


60వ వార్డు ఇందిరా కాలనీలో వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న కార్పొరేటర్ పి.వి.సురేష్


59వ వార్డు నెహ్రూనగర్‌లో పింఛన్ అందజేస్తున్న పుర్రె సురేష్ యాదవ్, సంపత్

మల్కాపురం: ప్రజాసంకల్ప యాత్రలో తాను ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ పెన్షన్ కానుకను రూ.3 వేలకు పెంచారు. అది అందుకున్న లబ్ధిదారులందరూ ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. పెంచిన సొమ్ము తమకు ఆసరాగా ఉంటుందంటూ ప్రతి పింఛన్‌దారుడు సీఎం వైఎస్ జగన్‌కు మనసారా కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

58వ వార్డులో 1,300 మందికి..

జీవీఎంసీ 58వ వార్డులోని 7 సచివాలయాల పరిధిలో గల సుమారు 1,300 మంది లబ్ధిదారులకు బుధవారం పింఛన్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు డి.శ్రీనివాస్‌రాజు, చుక్క వరలక్ష్మి, సత్యనారాయణరెడ్డి, వేణు, ఇతర నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందించారు.

59వ వార్డులో 1,644 మందికి..

జీవీఎంసీ 59వ వార్డులోని 6 సచివాలయాల పరిధిలో గల సుమారు 1,644 మంది లబ్ధిదారులకు ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, సంపత్, రేవళ్ల సత్యనారాయణ, ఖాన్ తదితరులు పింఛన్లు పంపిణీ చేశారు.

60వ వార్డులో 1,458 మందికి..

జీవీఎంసీ 60వ వార్డులోని 6 సచివాలయాల పరిధిలో గల సుమారు 1,458 మంది లబ్ధిదారులకు కార్పొరేటర్ పి.వి.సురేష్, పార్టీ వార్డు అధ్యక్షుడు ఆడారి హరీష్ తదితరులు వలంటీర్లతో కలిసి వెళ్లి పింఛన్లు అందజేశారు. లబ్ధిదారులందరూ ఆనందం వ్యక్తం చేశారు.

40వ వార్డులో 507 మందికి..

సింథియా: పింఛన్‌దారులకు ముందే సంక్రాంతి వచ్చింది. వారి ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పింఛన్‌ను 40వ వార్డు పరిధిలోని సుమారు 507 మంది లబ్ధిదారులకు సచివాలయ కన్వీనర్లతో కలిసి వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత గల ప్రతీ ఒక్కరికీ పింఛన్ అందించడమే సీఎం జగన్ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ రాజబాబు, సత్తిబాబు, నవ్య, వార్డు అధ్యక్షులు వరపల మహేష్, వార్డు యూత్ అధ్యక్షుడు గుండపు అశోక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెంట్ల బాలకృష్ణ, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.


58వ వార్డు పిలకవానిలెంలో పింఛన్ సొమ్ము అందిస్తున్న శ్రీనివాస్‌రాజు, చుక్క వరలక్ష్మి


40వ వార్డులో పింఛన్ నగదు అందజేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు

పింఛన్ పెంపుతో ఎంతో మేలు



నాడు ప్రభుత్వ పింఛన్ తీసుకోవాలంటే నాయకులు, జన్మభూమి కమిటీల చుట్టూ రోజుల కొద్దీ తిరగాల్సి వచ్చేది. నేడు వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి నెలా ఇంటికే వలంటీర్ పెన్షన్ సొమ్ము తీసుకొచ్చి ఇస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలకు పింఛన్ పెంచడంతో నాలాంటి వారికి ఎంతో మేలు జరుగుతుంది.

–వై.అప్పారావు, నెహ్రూ నగర్

సామాజిక చైతన్య సభ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రమేష్ తదితరులు

విశాఖ విద్య: బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 7న ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించ తలపెట్టిన బీసీ సామాజిక చైతన్య సభ పోస్టర్లను బుధవారం పార్టీ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ దాడి పురుషోత్తం రమేష్ ఆవిష్కరించారు. ఎన్ఏడీ సెంటర్‌లోని బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సభకు ముఖ్య అతిథిగా జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కార్పొరేషన్ కన్వీనర్ కేతిగుంట్ల సుబ్బారాయుడు, పాలిమేర శ్రీనివాసరావు, పల్లి శ్రీనివాస్ నాయుడు, వలిరెడ్డి శ్రీనివాసరావు, చల్ల మంజుల, నాదెండ్ల జ్యోతి, గొర్ల అప్పలరాజు, వెంకటేశ్వరరావు, ములకలపల్లి ప్రకాష్, రాజారావు, పురుషోత్తం పటేల్, నర్సింగ్‌రావు, నారాయణరావు, వెంకటరావు పాల్గొన్నారు.

న్యాయవాది కేవీ స్వామి హఠాన్మరణం

గాజువాక: సీనియర్ న్యాయవాది, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ స్వామి (64) హఠాన్మరణం చెందారు. బుధవారం ఉదయం ఎనిమిదిన్నర గంటల ప్రాంతంలో స్నానం చేసేందుకు సిద్ధమవుతుండగా గుండెపోటు రావడంతో, ఒక్కసారిగా కుప్పకూలిపోయినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే సమీపంలో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన మృతదేహాన్ని గాజువాక న్యాయవాదులు సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియలను శుక్రవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులో వాకింగ్ వద్దు

పెందుర్తి: పెందుర్తి నుంచి గోపాలపట్నం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రహదారి మధ్య రోడ్డులో ప్రజలు వాకింగ్, రన్నింగ్ చేయవద్దని పెందుర్తి ట్రాఫిక్ విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ జి.రమేష్ కోరారు. ఇటీవల వాకర్స్ తరచూ మధ్య రోడ్డులో ప్రమాదాలకు గురవుతున్న కారణంగా ఉదయం, సాయంత్రం వాకింగ్/రన్నింగ్ మధ్యమార్గంలో కాకుండా బీఆర్‌టీఎస్ కుడి, ఎడమ వైపు చేయాలని సూచించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం అగనంపూడి దువ్వాడ రైల్వే స్టేషన్ సమీపంలోని ముళ్ల పొదల్లో మృతదేహం ఉందన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించడంతో ఆ వ్యక్తి 4 రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని వైద్యులు తెలిపారు. మృతుడు నలుపు రంగు ప్యాంటు, పువ్వులతో కూడిన తెలుపు రంగు టీషర్టు ధరించి ఉన్నాడని, వయస్సు 43 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. ఆ వ్యక్తికి చెందినవారు ఎవరైనా ఉంటే దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు. ఆ వ్యక్తి ఎవరు, అక్కడికి ఎలా వచ్చాడు, ఎవరైనా చంపి పడేశారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'విశాఖ ఉక్కును కాపాడుకుంటాం'


దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో ఏర్పడిన ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఉద్యమాలతో సాధించుకున్న స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేట్‌పరం చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో 1056వ రోజు, బుధవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్ గురించి ప్రజలందరూ నిలదీసే సమయం ఆసన్నమైందన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.